సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 16 । మే । 2023



46.812 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 46.812 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 180 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) - రూ.63,240
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) - రూ.5,679
3 శాతం జీఎస్టీతో.. - రూ.5,849
నవర (8 గ్రా) - రూ.46,792

గరిష్టం/కనిష్టం 42.4 /30.8

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 33 శాతం ఉంది. మంగళవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, వడగాలులు వీస్తాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

శభాష్ కలెక్టర్

- దివ్యాంగురాలి కోసం కదలి వచ్చిన కలెక్టర్



మణెమ్మతో మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో ఓ దివ్యాంగురాలు తన సమస్యను విన్నవించుకునేందుకు వచ్చారు. ఆమెనే తెలుగుగంగ భూసేకరణ విభాగంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సి.మణెమ్మ. కలెక్టర్ హరినారాయణన్ ఆమె పరిస్థితిని గమనించి వేదిక నుంచి నేరుగా ఆమె వద్దకే వెళ్లి మాట్లాడారు. ఆమె అనారోగ్య కారణాల దృష్ట్యా ముందస్తు పదవీ విరమణ కోరారు. స్పందించిన కలెక్టర్ పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. దివ్యాంగురాలి పట్ల కలెక్టర్ తీసుకున్న చొరవను అక్కడ ఉన్న అర్జీదారులు శభాష్ అంటూ ప్రశంసించారు.

హంస వాహనంపై కామాక్షితాయి



సరస్వతీదేవి అలంకరణలో హంస వాహనంపై విహరిస్తున్న కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు హంసవాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం దీక్షాహోమం, బలిహరణ పూజ నిర్వహించారు. రాత్రి అమ్మవారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హంసవాహనంపై సరస్వతి అలంకారంలో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి వేడుకగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి శ్రీశైలం మల్లికార్జునశర్మ జ్ఞాపకార్థం కుమారులు సురేష్‌శర్మ, శశిశేఖర్‌శర్మ, లేబూరు శ్రీనివాసులురెడ్డి, వెంకటరామిరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, సుబ్బరామిరెడ్డి ఉభయ దాతలుగా వ్యవహరించారు.

829 పొగాకు బేళ్ల కొనుగోలు



మర్రిపాడు(ఆత్మకూరురూరల్): మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం జరిగిన పొగాకు కొనుగోళ్లలో మర్రిపాడు క్లస్టర్ రైతులకు సంబంధించిన 829 పొగాకు బేళ్లను కొనుగోలు చేశామని వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ తెలిపారు. రైతులు 867 బేళ్ల వేలం కేంద్రానికి తీసుకురాగా 38 బేళ్లను వివిధ కారణాల వల్ల వేలంలో తిరస్కరించామన్నారు. కిలో పొగాకుకు అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.189 చొప్పున నమోదైందని తెలిపారు.

డీఈఓ వెబ్‌సైట్‌లో ఖాళీల జాబితా

నెల్లూరు(టౌన్): డీఎస్సీ 1998కి సంబంధించి 9 మంది మెరిట్ అభ్యర్థుల జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ గంగాభవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 12న డీఎస్సీ 1998కి సంబంధించి 239 మందికి కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు. ఆ కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన 14 మంది స్థానంలో ఆ తరువాత మెరిట్ లిస్టులో ఉన్న వారికి గత నెల 27న కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు. ఆ కౌన్సెలింగ్ తర్వాత ఉన్న 9 ఖాళీలకు మెరిట్ ప్రకారం అభ్యర్థుల వివరాలను deonellore.50 webs.com వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. జాబితాలో ఉన్న అభ్యర్థులు ఈ నెల 17న జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు అన్ని సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. అభ్యర్థులు రూ.100 స్టాంప్ పేపర్‌పై అఫిడవిట్ సమర్పించాలని తెలిపారు.

ఆర్థిక ప్రగతికి బాటలు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారి అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. స్వయం సహాయక గ్రూపుల సభ్యులకు బ్యాంక్ లింకేజ్ రుణాలను అందిస్తూ వారి ఉన్నతికి చర్యలు తీసుకుంటోంది. వారు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ రుణాలను తిరిగి చెల్లిస్తున్నారు. మరలా అధిక మొత్తంలో రుణాలు పొందుతున్నారు. అయితే రుణాల మంజూరులో నూతన విధానాన్ని ప్రారంభిస్తూ గ్రూపులకే కాకుండా వ్యక్తిగతంగా కూడా రుణాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టారు.



చేజర్లలో సమావేశంలో పాల్గొన్న ఎస్‌హెచ్‌జీ మహిళలు (ఫైల్)

స్వయం సహాయక గ్రూప్ సభ్యులకు వ్యక్తిగత రుణాలు

- రూ.2 లక్షల నుంచి రూ 10 లక్షల వరకు
- 2023-24 లక్ష్యం రూ.1,031 కోట్లు
- రికార్డు స్థాయిలో రుణాల మంజూరుకు చర్యలు

నెల్లూరు(పొగతోట): సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల్లోని (ఎస్‌హెచ్‌జీ) మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వారికి రూ.కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తోంది. జిల్లాలో 38 మండలాలున్నాయి. సుమారు 42 వేల ఎస్‌హెచ్‌జీ గ్రూపులున్నాయి. వాటిల్లో సుమారు 6 లక్షల మందికిపైగా సభ్యులు ఉన్నారు. వీరు ప్రతినెలా పొదుపు చేసుకుంటూ బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రుణాలు బాగా మంజూరవుతున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక ఏడాదిలో రూ.1,000 కోట్ల రుణాలు మంజూరు చేసిన సందర్భాల్లేవు. నాలుగేళ్లుగా ప్రతి ఏడాది రూ.1,000 కోట్లకుపైగా బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తున్నారు. సభ్యులు తీసుకున్న రుణం సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ రుణాలు తిరిగి చెల్లిస్తున్నారు. సక్రమంగా చెల్లించిన గ్రూపులకు వడ్డీ వారి బ్యాంకు అకౌంట్లలో ప్రభుత్వం జమ చేస్తోంది.

ఈ ఏడాదిలో..

2023-24 ఆర్థిక సంవత్సరంలో 1,41,691 మంది స్వయం సహాయక గ్రూపుల్లోని మహిళలకు రూ.1,031 కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. రెండేళ్ల క్రితం రుణాల మంజూరులో నూతన విధానాన్ని ప్రారంభించారు. గ్రూపులకే కాకుండా వ్యక్తిగతంగా కూడా రుణాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టారు. రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఇస్తున్నారు. తీసుకున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా డీఆర్‌డీఏ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే కొందరు చిన్నపాటి వ్యాపారాలు పెట్టుకున్నారు. ఈ ఏడాది రుణాలు తీసుకునేవారు డెయిరీలు, ఫ్లోర్ మిల్స్, పచ్చళ్ల తయారీ, పిండిమిల్లులు, బ్యూటీషియన్, చిన్న చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. మహిళలు ముందుకొచ్చి దరఖాస్తు చేసుకుంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి రుణాలు మంజూరు చేస్తారు.

ఆదుకుంటూ..

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేసేలా డీఆర్‌డీఏ అధికారులు చర్యలు చేపట్టారు. గత రెండు సంవత్సరాల్లోనూ వంద శాతానికిపైగా రుణాలు మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలను రుణాలు ఆదుకుంటున్నాయి. పిల్లల చదువులు, వివాహాలు, ఇతర అవసరాలకు బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీపై నగదు పొందుతున్నారు. తీసుకున్న రుణాలను అవసరాలకు ఉపయోగించుకుని మిగిలిన నగదుతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎస్‌హెచ్‌జీల్లో సభ్యులుగా ఉండడంతో బ్యాంకులు ఎటువంటి షూరిటీ లేకుండా రుణాలు మంజూరు చేస్తున్నాయి.

సూక్ష్మ సంస్థల జోలికి పోకుండా..

గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజల అవసరాలకు రుణాలిచ్చేందుకు సూక్ష్మ రుణ సంస్థలు పోటీ పడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇవి పదుల సంఖ్యలో ఉన్నాయి. ప్రజల అవసరాలను గుర్తించి అధిక వడ్డీలకు రుణాలిస్తున్నాయి. అనేకమంది వడ్డీలు చెల్లించలేక నానా అవస్థలు పడిన సందర్భాలున్నాయి. ఈ క్రమంలో మహిళలు ఆ సంస్థల జోలికి పోకుండా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను సకాలంలో మంజూరు చేస్తున్నారు. అధిక వడ్డీలు వసూలు చేస్తున్న సూక్ష్మ రుణ సంస్థల వివరాలు సేకరించే పనిలో అధికారులు ఉన్నారు.

సంవత్సరాల వారీగా ఇలా..

సంవత్సరం	ఎన్ని ఎస్‌హెచ్‌జీలు	లక్ష్యం	రుణం తీసుకున్న (రూ.కోట్లలో)	ఇచ్చిన మొత్తం (రూ.కోట్లలో)
2019-20	35,318	819.75	33,408	1,087.60
2021-22	23,449	883.41	24,552	1,192.43
2022--23	25,731	1,031.31	27,941	1,273.59

ఆర్థికంగా అభివృద్ధి

గ్రామంలో 10 మంది మహిళలం కలిసి గ్రూపు ఏర్పాటు చేశాం. పొదుపు చేసుకుంటూ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్నాం. తిరిగి సక్రమంగా చెల్లిస్తున్నాం. డీఆర్‌డీఏ అధికారుల సూచనల మేరకు రుణం తీసుకుని కూల్‌డ్రింక్ షాపు ఏర్పాటు చేశాం. ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాం.

– సరస్వతి, ఏటూరు, చేజర్ల మండలం



డెయిరీతో జీవనోపాధి



నేను 10 సంవత్సరాల నుంచి పొదుపు గ్రూపులో సభ్యురాలిగా ఉన్నాను. బ్యాంకు లింకేజీ ద్వారా అధిక మొత్తంలో వ్యకిగత రుణం తీసుకుని డెయిరీ ఏర్పాటు చేశాను. గేదెలను కొనుగోలు చేశా. వాటి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నా.

– సునీత, యనమదల, చేజర్ల మండలం

సిఫార్సుల్లేకుండా..



స్వయం సహాయక గ్రూపు మహిళలకు సకాలంలో బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తున్నాం. సిఫార్సులకు తావు లేకుండా దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలు ఇస్తున్నారు. వ్యక్తిగతంగా కూడా రుణాలిప్పించి చిన్నషాపులు, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయించి ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తున్నాం.

– సృజన, చేజర్ల ఏపీఎం

మహిళలకు రుణాలు



ఎస్‌హెచ్‌జీ మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేలా ప్రతి సంవత్సరం రూ.వందల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తున్నాం. తీసుకున్న రుణాలతో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాన్ని వంద శాతం సాధించేందుకు కృషి చేస్తాం.

– సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

సేవా ప్యానెల్ ఘన విజయం



రెడ్‌క్రాస్‌లో ఎన్నికల కౌంటింగ్ చేస్తున్న సిబ్బంది



గెలుపొందిన సేవా ప్యానెల్ సభ్యులతో ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి

- మరో దఫా రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి
- 15 పదవులకు 15 సేవా ప్యానెల్‌కే
- ఒక్క ఎంసీ పదవి గెలుచుకోని మరో పక్షం

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఎంతో ఉత్కంఠ రేపిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సేవా ప్యానెల్ వర్గం ఘన విజయం సాధించింది. ఇదే ప్యానెల్ 2020 ఫిబ్రవరిలో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. మూడేళ్ల పదవీ కాలం 2023 ఫిబ్రవరి 2వ తేదీ నాటికి ముగియగా రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు, కలెక్టర్ ఆదేశాలతో రెండు నెలలపాటు డీఆర్వో వెంకటనారాయణమ్మ ప్రత్యేకాధికాధికారిగా పాలన సాగింది. అనంతరం ఏప్రిల్ 2వ తేదీన ఎన్నికలు నిర్వహించారు. 34 మంది మేనేజింగ్ కమిటీ సభ్యులకు పోటీపడ్డారు. ఇందులో సేవా ప్యానెల్ తరపున ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి వర్గం 15 మంది సభ్యులతో పోటీకి దిగింది. అప్పటి జిల్లా సహకార శాఖాధికారి తిరుపాల్‌రెడ్డి ఎన్నికలు నిర్వహించారు. దీంతో మరో వర్గానికి చెందిన న్యాయవాది మక్కెన అంకయ్యచౌదరి తదితరులు ఎన్నికలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని కోర్టుకు వెళ్లారు. పరిశీలించిన కోర్టు ఎన్నికల కౌంటింగ్ నిర్వహించవద్దని తీర్పు చెప్పడంతో దాదాపుగా ఒకటిన్నర నెలపాటు కౌంటింగ్ నిలిచిపోయింది. కాగా గత శనివారం కోర్టు కౌంటింగ్ నిర్వహించుకోవచ్చని, అయితే తుది తీర్పునకు లోబడి కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో ప్రస్తుత జిల్లా సహకార శాఖాధికారి సుధాభారతి సోమవారం కౌంటింగ్ నిర్వహించారు.

16 రౌండ్లలో ఆధిక్యం

జిల్లాలో 7,700 ఓట్లు ఉండగా 4,001 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అందుకు సంబంధించి మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న రెడ్‌క్రాస్ కార్యాలయంలో 10 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కు 25 ఓట్ల చొప్పున కేటాయించారు. ఒక్కో రౌండ్‌కు 250 ఓట్ల చొప్పున మొత్తం 16 రౌండ్లు ఏర్పాటు చేశారు. లెక్కించిన ప్రతి రౌండ్‌లో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి సంబంధించిన సేవా ప్యానెల్ సభ్యులు 15 మంది తమ ఆధిక్యాన్ని కొనసాగించారు. ప్రతి రౌండ్‌లో అవతలి పక్షం ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయింది.

గెలుపొందిన సభ్యులు

సేవా ప్యానెల్‌కు చెందిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితోపాటు మలిరెడ్డి కోటారెడ్డి, ఎంవీ సుబ్బారెడ్డి, గునుపాటి ప్రసాద్‌రెడ్డి, దాసరి రాజేంద్రప్రసాద్, యాలమూరి రంగారావు, బయ్యా ప్రసాద్, సీహెచ్ జనార్దన్‌రాజు, శ్రీహరిరెడ్డి, వి.విజయకుమార్‌రెడ్డి, డి.సుధీర్‌నాయుడు, జి.ప్రసన్నాంజనేయులు, యడవల్లి సురేష్, డి.రవిప్రకాష్, సురేష్‌కుమార్ జైన్ ప్రతి రౌండ్‌లో మెజార్టీ సాధించారు. దీంతో ఎన్నికల నిర్వహణాధికారి, జిల్లా సహకార శాఖాధికారి అయిన సుధాభారతి వారికి గెలుపొందినట్లు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సభ్యులందరూ కలిసి జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డిని, ట్రెజరర్‌గా సురేష్‌కుమార్ జైన్‌ను ఎన్నుకున్నారు. అనంతరం సంబరాలు చేసుకున్నారు.

మరో దఫా సేవ చేసే భాగ్యం

గతంలో రెడ్‌క్రాస్ జీవిత సభ్యులు ఓటేసి మా ప్యానెల్‌ను గెలిపించారు. ఇప్పుడు కూడా అదే రీతిలో మరో దఫా సేవ చేసే భాగ్యాన్ని కల్పిస్తూ రెండోసారి గెలిపించారు. కరోనా సమయంలో చేసిన మేము సేవలు దేశవ్యాప్తంగా రెడ్‌క్రాస్‌కు పేరు తెచ్చాయి. వరదలు వచ్చినా, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా, ఆరోగ్య ఉపద్రవాలు వచ్చినా రెడ్‌క్రాస్ ద్వారా గతంలో కన్నా మరింత మెరుగ్గా సేవలందిస్తాం. ఓటేసి గెలిపించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

– ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

- కలెక్టర్ ఎం.హరినారాయణన్



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): 'స్పందన' కార్యక్రమంలో వచ్చే అర్జీలపై అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు అందజేసిన వినతులను జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మలతో కలిసి కలెక్టర్ పరిశీలించారు.

ఇల్లు కూల్చారయ్యా..

కొందరు అన్యాయంగా తన ఇంటిని కూల్చేశారని, స్థానిక అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, నిలువ నీడ లేక పాఠశాలలో తలదాచుకుంటున్నామని, న్యాయం చేయాలని విడవలూరు మండలం పార్లపల్లికి చెందిన చేబ్రోలు చిన్నప్ప కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించేలా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అన్ని శాఖల ఉన్నతస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీ ఈఏపీ సెట్

- 50 మంది గైర్హాజరు



విద్యార్థిని హాల్‌టికెట్ తనిఖీ చేస్తున్న పరీక్ష కేంద్రం సిబ్బంది

నెల్లూరు(టౌన్): ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ తదితర కోర్సుల్లో ప్రవేశం కోసం సోమవారం నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్ ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో నారాయణ, గీతాంజలి, ఆర్‌ఎస్‌ఆర్, విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు రెండు విడతల్లో జరిగింది. ఉదయం జరిగిన పరీక్షకు 738 మందికి గాను 708 మంది విద్యార్థులు హాజరయ్యారు. 30 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 738 మందికి గాను 718 మంది హాజరయ్యారు. 20 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రెండు విడతల్లో కలిపి 1,476 మందికి గాను 1,426 మంది హాజరు కాగా, 50 మంది గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 96.6 శాతం హాజరు నమోదైంది. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. అడ్మిషన్ కార్డుతో పాటు ఫొటో గుర్తింపు కార్డును తనిఖీ చేశారు.

గంగపుత్రులకు అండగా..

రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు అండగా నిలుస్తోంది. వేట విరామ సమయంలో అందించే మత్స్యకార భరోసా రూ.10 వేలను ఈ ఏడాదికి సంబంధించి వారి ఖాతాల్లో మంగళవారం ప్రభుత్వం జమ చేయనుంది. ఈ క్రమంలో గంగపుత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- నేడు మత్స్యకార భరోసా పంపిణీ చేయనున్న ప్రభుత్వం
- జిల్లావ్యాప్తంగా 12,072 మందికి లబ్ధి
- నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ



వేట లేకపోవడంతో వలలు అల్లుకుంటున్న మత్స్యకారులు

బుచ్చిరెడ్డిపాళెం: ఉవ్వెత్తున ఎగసిపడే అలలు, ప్రతికూల వాతావరణంలో జీవనోపాధే లక్ష్యంగా సముద్రంలో వేట సాగించే మత్స్యకారులకు గత నాలుగేళ్లుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. గత ప్రభుత్వం మత్స్యకారులను పట్టించుకోకపోతే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏటా మత్స్యకార భరోసా కింద రూ.10 వేలు అందిస్తూ భరోసా ఇస్తోంది.

జీవనోపాధికి దూరం

వాతావరణంలో వచ్చే ప్రతికూల పరిస్థితుల కారణంగా మత్స్యకారులు అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో సముద్రంలో వేటకు దూరమవుతున్నారు. అలాగే మత్స్యసంపద వృద్ధి కోసం ప్రభుత్వం ప్రతి ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు అంటే దాదాపు 60 రోజులపాటు సముద్రంలో వేట నిషేధం విధిస్తుంది. దీంతో మత్స్యకారులు ఆ సమయంలో జీవనోపాధిని కోల్పోతుంటారు.

2,810 బోట్లు రిజిస్ట్రేషన్

జిల్లావ్యాప్తంగా 167 కిలోమీటర్ల తీర ప్రాంతంలో ఉన్న ఉలవపాడు, గుడ్లూరు, కావలి, బోగోలు, అల్లూరు, విడవలూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు తీర ప్రాంత మండలాలతోపాటు మరో 14 మండలాల్లో ఉన్న దాదాపు 2,810 బోట్లకు రిజిస్ట్రేషన్ చేశారు. జిల్లావ్యాప్తంగా 12,072 మంది గంగపుత్రులను మత్స్యకార భరోసాకు ఎంపిక చేసినట్లు జిల్లా అధికారులు తెలిపారు. వీరందరికీ మత్స్యకార భరోసా కింద రూ.10 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. ఈ నగదును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం మత్స్యకారుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు.

డేంజరస్ డెంగీ

డెంగీ వ్యాధి ప్రమాదకరమైంది. ఈ వ్యాధి ఆర్బో వైరస్ వల్ల సంక్రమిస్తుంది. పరిసరాల్లోని నిల్వ నీటిలో దోమలు స్థావరాలు ఏర్పరుచుకుని కుట్టడం వల్ల వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఈ వ్యాధిని నివారించొచ్చు. నేడు జాతీయ డెంగీ నివారణా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

నెల్లూరు (అర్బన్): డెంగీ వ్యాధి ఒకప్పుడు దేశం నుంచి కనుమరుగైనట్టే కనిపించింది. అయితే గత 20 ఏళ్లుగా డెంగీ కేసులు దేశంలో మళ్లీ వి జృంభించాయి. డెంగీ వ్యాధి తీవ్రమైనప్పుడు పలువురు మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి. డెంగీ వ్యాధిపై అవగాహన కలిగి ముందస్తు చర్యలు చేపట్టడం ద్వారా డెంగీని నియంత్రించవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. లేకుంటే ప్రాణాపాయమని చెబుతున్నారు. డెంగీ వ్యాధి ఆర్బో వైరస్ ద్వారా సంక్రమిస్తుంది. ఎడిస్ ఈజిప్ట్ రకం దోమ కుట్టినప్పుడు దాని లాలాజలం ద్వారా మానవ శరీరంలోకి వైరస్ ప్రవేశిస్తుంది. ఈ పరిస్థితిని గమనించిన కేంద్ర ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మే 16 వ తేదీని జాతీయ డెంగీ నివారణా దినోత్సవంగా ప్రకటించి ప్రజల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో డెంగీపై మంగళవారం అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించనున్నారు.


డెంగీకి కారణమైన ఎడిస్ దోమ

జిల్లాలో పెరుగుతున్న డెంగీ కేసులు

జిల్లా వ్యాప్తంగా 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 2 ఏరియా ఆస్పత్రులు, 1 జిల్లా ఆస్పత్రితో పాటు నెల్లూరులో జిల్లా సర్వజన వైద్యశాల ఉంది. వీటిలో డెంగీ నిర్ధారణకు ఎలిషా పరీక్ష అందుబాటులో ఉంది. అయితే ప్రజలు భయంతో ఎక్కువగా ప్రైవేట్ ఆస్పత్రుల బాట పడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్కువగా ర్యాపిడ్ పద్ధతిలో డెంగీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. వీటిలో పాజిటివ్ వస్తే ప్రభుత్వాధికారులు పరిగణలోకి తీసుకోవడం లేదు. కేవలం ఎలిషా పద్ధతిలో పరీక్ష చేసి వ్యాధిని నిర్ధారిస్తేనే డెంగీగా పరిగణిస్తున్నారు. జిల్లాలో ర్యాపిడ్ పద్ధతిన ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఏడాదికి సుమారు 5 వేల మంది డెంగీ బారిన పడుతున్నట్లుగా తెలుస్తోంది. నెల్లూరు నగరంతో పాటు కలువాయి, ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, బోగోలు, కలిగిరి, ఆత్మకూరు, రాపూరు, అల్లూరు, తదితర ప్రాంతాల్లో డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్లు తేలింది.

జిల్లాలో ప్రభుత్వ లెక్కల ప్రకారం డెంగీ కేసులు

సంవత్సరం	ప్రభుత్వ,	ప్రైవేట్ ఆస్పత్రులు
2018	41	261
2019	155	390
2020	28	140
2021	26	125
2022	148	210
2023(ఏప్రిల్,మే)	91	150

మార్గదర్శకాలు పాటిస్తే డెంగీ దూరం

డెంగీ నివారణకు ప్రపంచ ఆరోగ్య సంస్థ కొన్ని మార్గ దర్శకాలను సూచించింది. అవి పాటిస్తే డెంగీని నిర్మూలించవచ్చు. ర్యాపిడ్ ద్వారా డెంగీ నిర్ధారణ అయితే దాన్ని పరిగణలోకి తీసుకొని వైద్య చికిత్స అందించాలి. అయితే వైద్యశాఖ పరిగణలోకి తీసుకోవడం లేదు. ఎలిషా పరీక్షను ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రవేశ పెట్టాలి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో అతి తక్కువ మంది మాత్రమే ఎలిషా చేస్తున్నారు.దోమల వ్యాప్తి చెందకుండా ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఇంటి లెట్రిన్, బాత్‌రూమ్ పైపులకు మెష్ కట్టాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీటి గుంతల్లో దోమలు గుడ్లు పెట్టకుండా ఆయిల్ బాల్స్ వేయాలి. అప్పుడే డెంగీ వ్యాధి నివారణ సాధ్యం.

అవగాహనతోనే డెంగీకి చెక్..



డెంగీ వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు పాటిస్తే ఈ వ్యాధిని అరికట్టవచ్చు. ప్రజలు నీటిని నిల్వ ఉంచుకోకుండా వారాకోసారి డ్రైడేగా పాటించాలి. ఇంటిలోపల,బయట, ఖాళీ సీసాలు, టైర్లు, టెంకాయ చిప్పల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. తద్వారా దోమలకు ఆవాసం లేకుండా చేసి డెంగీ వ్యాధిని కలిగించే లార్వాలను అరికట్టవచ్చు. ఒకవేళ ప్రజలకు జ్వరం, విపరీతమైన తలనొప్పి ఉన్నట్లయితే తక్షణమే సమీపంలోని వైద్యులను కలవాలి.

– డాక్టర్ బ్రిజిత, జిల్లా మలేరియా నివారణాధికారిణి

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: దివ్యాంగుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా కృషి చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో అలింకో సంస్థ సహకారంతో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి వైకల్య నిర్ధారణ శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ గతంలో సమాజంలోని అన్ని వర్గాలతో పాటుగా దివ్యాంగులకు అండగా నిలుస్తామని చంద్రబాబు ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక మోసం చేశారని గుర్తుచేశారు. దివ్యాంగులకు 80శాతానికిపైగా వైకల్యం ఉంటేనే దివ్యాంగ పెన్షన్ నగదును రూ.1000 నుంచి రూ.1500కు పెంచుతామని నిబంధనలు పెట్టారని తెలిపారు. 90శాతం వైకల్యం ఉన్న వారికి కూడా 79శాతం ఉందంటూ సర్టిఫికెట్లు ఇచ్చి తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాత నిబంధనలను పక్కనబెట్టి దివ్యాంగులందరికీ ప్రతినెలారూ.3వేలు పెన్షన్ అందజేస్తూ అండగా నిలుస్తున్నారని కొనియాడారు. దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాల పంపిణీకి ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయాలనే ఆలోచన గతంలో చేశామని, అయితే కోవిడ్ కారణంగా ఆలస్యమైందన్నారు. ప్రస్తుతం తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి సహకారంతో దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని కొనియాడారు. వైకల్య శాతంతో పనిలేకుండా రూ.3వేలు పెన్షన్ అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దివ్యాంగులు అండగా నిలవాలని కోరారు. ఎంపీపీ మందా కవిత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు మందల పెంచలయ్య, మందల మోహన్‌రావు, నాటకం శ్రీనివాసులు, నంబూరు రాజా నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వి'భజన' ర్యాలీలు


మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న చంద్రారెడ్డి వర్గీయులు

ఆత్మకూరు: టీడీపీ నాయకుడు లోకేశ్ పాదయాత్ర వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఆ పార్టీ నాయకులు సోమవారం సంఘీభావ ప్రదర్శనలు చేపట్టారు. టీడీపీ నాయకుడు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఓ వర్గం మున్సిపల్ పరిధిలోని బైపాస్‌రోడ్డు నుంచి మున్సిపల్ బస్టాండ్ వరకు మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించి మమ అనిపించింది. కాగా కన్నబాబు వర్గం దేపూరు, నువ్వూరుపాడు గ్రామాల మీదుగా ఆత్మకూరులోని మున్సిపల్ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించింది. టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి ర్యాలీలు నిర్వహించడంపై ఇదేం వి'భజన' అంటూ పట్టణ ప్రజలు ముక్కున వేలేసుకున్నారు.

చంద్రబాబుకు పవన్ కల్యాణ్ బానిస

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: చంద్రబాబుకు జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కట్టుబానిసగా మారిపోయాడు, ఆయన ఇచ్చే సూట్‌కేసులు తీసుకుని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కోవూరులో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవన్‌కల్యాణ్ జనసేన పార్టీని చంద్రబాబుకు అమ్మివేసి ఎన్ని కోట్లు తీసుకున్నారో ఆయనకే తెలుసునన్నారు. చంద్రబాబును పవన్‌కల్యాణ్ కలిసే సమయంలో మనోహర్‌ను తీసుకొనిపోడని, వారిద్దరి మధ్య ఏ ఒప్పందం ఉందో ఎవరికీ తెలియదన్నారు. రంగాను చంపించింది చంద్రబాబు అని తెలిసినప్పటికీ ఆయనతో పవన్ జత కలవడం దారుణమన్నారు. ఈ విషయాన్ని పవన్ ఫ్యాన్స్, కాపు నాయకులు తెలుసుకోవాలన్నారు. పవన్ కల్యాణ్‌ను ప్యాకేజీ స్టార్ అంటే ఎవరినైనా చెప్పుతో కొడతానని ఆయన అనడం సిగ్గుచేటు అన్నారు. పవన్ ప్యాకేజీ స్టార్ అని నేనే అంటున్నా నీకు దమ్ము ఉంటే నన్ను చెప్పుతో కొట్టు చూద్దాం అని సవాలు విసిరారు. చిరంజీవి కటుంబంలో పవన్ చీడపురుగులా ఉన్నారన్నారు. చిరంజీవి హుందాగా నడుచుకొని ముందుకు సాగుతారన్నారు. పవన్ జనసేన పార్టీని 20, 25 సీట్లకు చంద్రబాబుకు కోట్లాది రూపాయలకు అమ్మేశారన్నారు. జనసేన పార్టీ నాయకులు, కాపునాయకులు పవన్‌కల్యాణ్‌ను తరిమికొట్టే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ఈ సమావేశంలో డీసీఎంబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి తదితరులు ఉన్నారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

- స్పందనలో ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి


బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): చట్టపరిధిలో బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 87 మంది తమ సమస్యలను అర్జీల రూపంలో ఎస్పీకు అందజేశారు. వాటిని పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. పలువురు క్షేత్రస్థాయిలో పోలీసులు పట్టించుకోవడం లేదని ఎస్పీ దృష్టికి తీసుకురాగా ఆయన సంబంధిత అధికారులపై మండిపడ్డారు. మరో మారు ఇలాంటివి పునరావృత్తం కారాదని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగాల పేరిట మోసాలు అధికంగా జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏఎస్పీ డీ హిమవతి, నెల్లూరు రూరల్, డీటీసీ డీఎస్పీలు పీ వీరాంజనేయరెడ్డి, ఎస్ శిరీషా, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసగించారు – బాధితులు

మేమంతా నిరుద్యోగులం. ఇందుకూరుపేటకు చెందిన గౌతమి దంపతులు ఏపికాస్‌లో ఉన్నతాధికారులు తెలుసనని, వారి ద్వారా పీహెచ్‌సీలు, ప్రభుత్వ వైద్యశాలల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్, సూపర్‌వైజర్, తదితర ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. ఇప్పటికే పలువురికి ఉద్యోగాలు ఇప్పించామని చెప్పారు. వారి మాటలను నమ్మి సుమారు రూ.8లక్షలు ఇచ్చాం. నెలలు గడుస్తున్నా ఉద్యోగాల ఊసేలేదు. గట్టిగా నిలదీయగా దిక్కున్నచోట చెప్పుకోమంటున్నారు. మాలాగే ఎంతో మందిని మోసగించారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.

జిల్లాలో అనధికార విద్యుత్ కోతల్లేవు


మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటసుబ్బయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో ఎలాంటి అనధికార విద్యుత్ కోతలు విధించడం లేదని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్‌భవన్‌లోని తన ఛాంబర్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఉదయగిరి ప్రాంతంలో ఈదురుగాలులు వీస్తున్న సమయంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కొద్దిసేపు విద్యుత్ సరఫరాను నిలిపామని తెలిపారు. కావలిలో ఎటువంటి విద్యుత్ కోతలు విధించలేదన్నారు. జిల్లాలో విద్యుత్ వినియోగం పెరిగినప్పటికీ ఎలాంటి కోతలు లేకుండా మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని రైతులకు పగటి వేళ 9 గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందిస్తున్నామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని ప్రతి విద్యుత్ సెక్షన్ కార్యాలయా ల్లోని సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. పీక్‌లోడ్ ఉన్న సమయాల్లో సబ్‌స్టేషన్లలో ఎలాంటి అంతరాయాలు తలెత్తిన వెంటనే మరమ్మతులు చేసి సత్వరమే సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించామన్నారు. జిల్లా సర్కిల్‌కు రోజువారీ కోటా కింద 19 మిలియన్ యూనిట్లు విద్యుత్ అందుతుండగా, ప్రస్తుతం 15 మిలియన్ యూనిట్ల వినియోగం మాత్రమే జరుగుతోందన్నారు. జిల్లాలో అనధికార విద్యుత్ కోతలు విధిస్తున్నారనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యమో? ఆత్మహత్యో? మరే ఇతర కారణమో తెలియదు కానీ పాతసెట్నల్ ఆఫీసులోని ఓ గదిలో వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతదేహం కుళ్లి దుర్గంధం వెదజల్లుతుండడాన్ని గుర్తించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీసుల సమాచారం మేరకు..కొత్తూరులోని హెచ్‌కేబాబునగర్‌లో హర్షవర్ధన్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన బాబాయి శిరీష్‌కుమార్(50). మనస్పర్థల కారణంగా సుమారు 20ఏళ్ల క్రితం భార్య శైలజతో శిరీష్‌కుమార్ విడిపోయారు. అప్పట్నుంచి నగరంలోని హోటళ్లలో క్యాటరింగ్ పనులు చేసుకుంటూ అక్కడే నివాసం ఉండేవారు. అప్పుడప్పుడు హర్షవర్ధన్ వద్దకొచ్చివెళ్లేవారు. ఆయనకు సుమారు రెండేళ్ల క్రితం ప్రమాదం జరగడంతో కాలుకు శస్త్రచికిత్స చేశారు. గత కొంతకాలంగా గ్యాస్ట్రిక్‌ట్రబుల్‌తో బాధపడుతున్నాడు. ఈ నెల 8న హర్షవర్ధన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆటోనగర్‌లోని పాత సెట్నల్ ఆఫీసు ప్రాంగణంలోని ఓ గదిలో శిరీష్‌కుమార్ మృతదేహం కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతూ ఉండడాన్ని స్థానికులు గమనించారు. హర్షవర్ధన్‌కు సమాచారం అందించగా వెళ్లిచూడగా మృతదేహం పురుగులు పట్టి ఉంది. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడు గత కొద్దిరోజులుగా పాడుబడిన సెట్నల్ కార్యాలయంలో ఉంటున్నట్లు తెలిసింది. మృతికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరులో ఓ వ్యక్తి కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు..కొత్తూరుకు చెందిన నెల్లూరు శివరాం(41), నాగలక్ష్మి దంపతులు. భర్తతో గొడవపడిన భార్య కొంత కాలంగా పిల్లలతో కలసి కోవూరు మండలం ఇనమడుగులోని పుట్టింట్లో ఉంటోంది. అప్పట్నుంచి ఒంటరిగా ఉంటున్న శివరాం మనస్తాపంతో సుమారు నాలుగైదు రోజుల క్రితం ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎవరూ గుర్తించకపోవడంతో మృతదేహం కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతూ ఉండడంతో పొరుగున ఉన్నవారు అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వెంకటరాజేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

పెయింటర్‌ది హత్యే

- పోలీసుల విచారణలో వెల్లడి
- భార్యతో పాటు ఇద్దరు బావమరుదుల అరెస్ట్


వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(క్రైమ్): పెయింటర్ షేక్ సుబహాన్ అలియాస్ బత్తల చిన్న(39) రాళ్లపై పడడం వల్ల అయిన గాయాలతో మృతి చెందలేదని, ఆయనను భార్య, బావమరుదులు హత్యచేశారని వేదాయపాళెం పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ తెలిపారు. సోమవారం ఆయన వేదాయపాళెం పోలీసుస్టేషన్‌లో హత్యకు దారితీసిన పరిస్థితులు, నిందితుల వివరాలను విలేకరులకు వెల్లడించారు. వివరాలు.. గాంధీనగర్‌లో షేక్ సుబహాన్(39), అబీదా దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. సుబహాన్ పెయింట్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 7న రాత్రి సుబహాన్ రెవెన్యూకాలనీ చివరలో తీవ్రగాయాలతో పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. అతని భార్యకు సమాచారం అందించగా భర్తను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా సుబహాన్ మార్గం మధ్యలో మృతిచెందారు. తన భర్త మద్యం మత్తులో రాళ్లపై పడడంతో మృతి చెందాడని అప్పట్లో అబీదా వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై రాజ్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఆమె ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో లోతుగా దర్యాప్తు చేయగా వేధింపుల నేపథ్యంలో సుబహాన్‌ను బావమరుదులు, భార్య కలిసి హత్యచేసినట్లు వెల్లడైంది. దీంతో పోలీసులు కేసును హత్యకేసుగా మార్పు చేశారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం నిందితులు పోలీసుస్టేషన్‌లో లొంగిపోయారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

వేధింపులు తాళలేక...

సుబహాన్‌కు మద్యం అలవాటు ఉంది. మద్యం మత్తులో భార్యను తీవ్రంగా వేధించేవాడు. పలుమార్లు పద్ధతి మార్చుకోమని బావమరుదులైన షేక్ మహమ్మద్, షేక్ గౌస్‌బాషా సూచించినా పెడచెవిన పెట్టారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 7న సాయంత్రం సుబహాన్ మద్యం మత్తులో భార్యతో తీవ్రంగా గొడవపడ్డాడు. దీంతో కోపోద్రిక్తులైన బావమరుదులు ఎలాగైనా అతనికి తగిన బుద్ధి చెబుదామని అబీదాకు చెప్పగా అందుకు అంగీకరించింది. దీంతో సుబహాన్‌ను రెవెన్యూకాలనీలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి సిమెంట్ రబ్బీస్ రాయితో తీవ్రంగా కొట్టి గాయపరిచారు. అక్కడి నుంచి వెళ్లిపోయి అబీదాకు సమాచారం అందించారు. ఆమె భర్తను చికిత్స నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ రాజ్‌కుమార్, ఏఎస్‌ఐ ప్రసాద్, హెడ్‌కానిస్టేబుళ్లు జీ సుబ్బారావు, సురేష్, కానిస్టేబుల్స్ మస్తాన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి:	రూ.55
సన్నవి:	రూ.25
పండ్లు:	రూ.18

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ లైవ్	:రూ.139
లేయర్ లైవ్	: రూ.95
బ్రాయిలర్ చికెన్:	రూ.240
స్కిన్‌లెస్ చికెన్:	రూ.266
లేయర్ చికెన్:	రూ.162